

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# కట్నం ఎవరి సొమ్ము?

డాక్టరు శకుంతల అరుణను పరీక్ష చేసిన తరువాత ప్రిస్క్రిప్షన్ రాస్తూ అన్నది. 'డెలివరీ అయ్యేదాకా నువు బాగా రెస్ట్ తీసుకోవాలి, చాలా వీక్‌గా ఉన్నావు. ముఖ్యంగా టెన్షనూ, వర్రీ లేకుండా చూసుకోవాలి' అన్నది శకుంతల.

''మా అత్తగారు ఉన్నంతకాలం నాకు టెన్షనూ, వర్రీ తప్పదు గదా'' అన్నది అరుణ కాంతి విహీనంగా నవ్వుతూ.

''ఈ గొడవలు ఎప్పుడూ ఉండేవే. ఈ నాలుగయిదు నెలలూ నువ్వే వర్రీస్ లేకుండా ఉండటం అవసరం. బ్లడ్‌లో హిమోగ్లోబిన్ పర్సంటేజ్ చాలా తక్కువగా ఉంది. బ్లడ్ ఎక్కించాల్సి వస్తుంది..'' అన్నది శకుంతల.

శకుంతలా, అరుణా ఇంటర్ దాకా క్లాస్‌మేట్స్. అందుచేత మంచి ఫ్రెండ్స్. వాళ్ళ మధ్య దాపరికాలు లేవు. అరుణ తన కుంటుంబ విషయాలన్నీ శకుంతలకు చెప్పి ఆమె సలహా తీసుకుంటూ ఉంటుంది. నిజానికి చదువుకునే రోజుల్లో అరుణదే అన్నిటా పై చేయిగా ఉండేది. ఇప్పుడు పరిస్థితులు తారుమారు అయ్యాయి. అప్పట్లో అందరికీ నాయకత్వం వహించిన అరుణ, ఇప్పుడు అత్తగారికి, మామగారికీ కూడా భయపడాల్సి వస్తోంది.

అరుణ ఆటోలో ఇంటికి వచ్చింది. ఆ వేళ ఆఫీసుకు వెళ్ళబుద్ధి కాలేదు. బద్ధకంగా ఉంది. పైగా నెలలు నిండుతున్న కొద్దీ నడవాలంటే ఇబ్బందిగా ఉంటోంది. దానికి తోడు అందరూ తన వంక వింతగా చూస్తున్న ఫీలింగు కలుగుతోంది. బయట తిరగాలంటే సిగ్గుగా ఉంది.

అరుణ సోఫాలో కూర్చుని పత్రిక తిరగేస్తోంది. అందులో అందంగా బొద్దుగా ఉన్న పసిపిల్లల ఫోటోల వంక అనిమిష నేత్రాలతో చూస్తోంది. పత్రికలో కనిపించే రకరకాల పేర్లను గమనిస్తోంది. పాప అయితే ఏం పేరు పెట్టాలి, బాబు అయితే ఏం పేరు పెట్టాలి అని ఆలోచిస్తోంది. పేరు మూడే మూడు అక్షరాలు ఉండాలి. అందంగా, రొమాంటిక్‌గా తేలికగా పిల్చుకునేందుకు వీలుగా ఉండాలి... మంచి పేరు సెలెక్ట్ చేసి పెట్టమని చంద్రానికి చెప్పాలి. భర్త గుర్తుకు రాగానే అతనితో మాట్లాడాలనిపిచింది. ఫోన్ చేసింది. చంద్రం లైన్ మీదకు వచ్చాడు. తీరా అతడు ఏమిటని అడిగితే, ఈ విషయం చెప్పటానికి సిగ్గుపడింది. తిడతాడని భయపడింది.

''సాయంత్రం పెందరాళే రండి సినిమాకు వెళ్దాం'' అన్నది.

"నీకీ సినిమా పిచ్చి పోదు, చివరకు ఆవేళ నేను డాక్టర్ని నర్సునూ కడా సినిమా హాలుకే తీసుకురావాలేమో'' అన్నాడు చంద్రం.

''సరే అయితే ఇక నుంచి సినిమాలు బంద్, సినిమాలకే కాదు. మీతో కూడా ఎక్కడికీ రాదు'' అన్నది చిరుకోపం తెచ్చుకొని.

ఇంతలో కింద అత్తగారి గొంతు ఖంగున మోగటం వినిపించి ఒక చెవి అటు విసిరింది. 'ఈ ఇంట్లో అంతా రాణీ వాసపు స్త్రీలు. అవతలి పుల్ల తీసి అవతలపెట్టదు. పుట్టింటి నుంచి తెచ్చుకున్న పరిచారికలు పాతికమంది ఇక్కడ పడి ఉన్నట్లు, మేడ ఎక్కి కూర్చుంటుంది. అన్నీ పట్టుకెళ్ళి ఆ మహాతల్లి చేతికీ నోటికీ అందించాలి. నోటికి అందించినా తింటుందో తినదో. మొగుడొచ్చి నమిలి నోట్లో పెట్టాలేమో' అంటోందామె.

ఆమె అత్తగారు, తమ కోడలు ఒకే ఇంట్లో ఉండాల్సిన మనుషులు. ఇద్దరి మధ్యా సఖ్యతే లేదు. బద్ధ శత్రువుల్లా ఉంటున్నారు. పెద్ద ఆవిడ గనుక ప్రతిదానికీ ఎందుకు రాద్ధాంతం చేయటం అని ఊరుకుంటున్న కొద్దీ రెచ్చిపోతోంది.

ఫోన్‌లో చంద్రంతో చెప్పింది అరుణ ''ఇక్కడ మీ అమ్మ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రసారం చేస్తోంది''

''నువు కథ పెంచకు' అన్నాడు.

''కథ పెంచేందుకూ తుంచేందుకకూ ఆమె నాకు అవకాశం ఇస్తే గదా'' అన్నది అరుణ.

సాయంత్రం దాకా ఆమె మేడ దిగి రాలేదు. చంద్రం ఇంటికి వచ్చాక అడిగాడు ''డాక్టరు ఏమంది?''

''మీ అమ్మతో యుద్ధాలు చేయవద్దు అంది. కానీ ఆమె ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుంటే ఎంతవరకూ ఊరుకోగలను?' అన్నది.

''ఓకే ఆమెకు నేను చెబుతానులే పద'' అంటూ తొందర పెట్టి భార్యను బయటకు తీసుకెళ్ళాడు.

సినిమా చూసి హోటల్లో భోంచేసి వచ్చారు. కాసేపు బయట తిరిగి వచ్చినందువల్ల అరుణ మూడ్స్ మారినాయి. ఆమె సంతోషంగా వున్న సమయం చూసి, భార్య చేతిని మృదువుగా ముద్దుపెట్టుకొంటూ అడిగాడు.

''మన ఇంట్లోకి ఇంకో చిట్టి పొట్టి వెధవ వస్తున్నాడు గదా. ఈ శుభ సందర్భంలో చిన్న కోరిక. మనం అలా అలా హాయిగా తిరిగి రావటానికి మనకొక హీరోహోండా... మా అమ్మ ఒక నెక్లెస్ కావాలంటోంది. మీ వాళ్ళను అడిగి ఈ రెండూ తెచ్చావంటే... అంతా ఓ.కే అయిపోతుంది...'' అన్నాడు చంద్రం.

''మీరు తిరగటానికి హీరోహోండా కాకపోతే, ఏకంగా హెలికాప్టరు కొనుక్కోండి. మీ అమ్మకు ఒక నెక్లెస్ ఏంఖర్మ ఏడువారాల నగలు చేయించుకోండి... వద్దన్నదేవరూ? దానికి నన్ను అడగటం ఎందుకు?'' అన్నది అరుణ ఆశ్చర్యంగా.

''నిన్ను అడగటం ఎందుకు అంటే నువ్వు తల్లివి కాబోతున్నావు కదుటోయ్'' అన్నాడు చంద్రం.

''పెళ్ళి అయిన తరువాత తల్లి కావటం సహజమే కదా. ఇందుకు మీ అందరికీ ఖరీదైన లంచాలు ఇవ్వాల్సిన అవసరం ఏముంది?

''అవి లంచాలు కాదోయ్,. కట్నాలు. ..''

"నేను కట్నాలు ఇవ్వటానికీ, పుచ్చుకోవటానికీ బద్ధ వ్యతిరేకిని. పెళ్లి అప్పుడే ఇవ్వలేదు. ఏడాది తరువాత ఇప్పుడేమిటి కట్నాలూ, కానుకలూ?" అన్నది అరుణ ముహం చిట్లించుకొని.

"అంత ఓవర్ యాక్షన్ చేయకు. కట్నం లేకుండా పెళ్లి చేసుకోవాల్సిన ఖర్మ నాకేం పట్టింది? నాకేం కన్ను వంకరా, కాలు వంకరా? సుందర వదనుడ్ని. అందరికన్నా రెండు ఆకులు ఎక్కువ చదివిన వాడ్ని. నెలకు నాలుగు వేలు సంపాదించుకుంటున్న వాడ్ని కనుకనే మీ నాన్న నాకు లక్ష రూపాయల కట్నం ఇచ్చాడు. అది ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ విత్ ఇనీషియల్ పేమెంట్ అన్న మాట. పండగలకూ, పబ్బాలకూ, ఇదుగో ఇలాంటి ప్రత్యేక సందర్భాల్లోనూ మిగిలిన ఇన్‌స్టాల్ మెంట్స్ చెల్లించాలి కదా... అందుకే అడుగుతున్నాను..." అన్నాడు చంద్రం.

భర్త చెబుతున్న విషయం విని అరుణ ఆశ్చర్యపోయింది. అవాక్కు అయింది. తెప్పరిల్లిన తరువాత అన్నది "నిజం చెప్పండి, మా నాన్న మీకు లక్ష రూపాయలు కట్నంగా ఇచ్చాడా...?"

"ఏమీ తెలియనట్లు మాట్లాడుతావేం. పెళ్లికి నెలరోజుల ముందే మీ నాన్న లక్ష రూపాయలూ తెచ్చి ఇచ్చాడు. ఆ డబ్బు మా నాన్న ఫిక్సడ్ డిపాజిట్‌లో వేసుకున్నాడు. మీ నాన్న ఆ డబ్బు ఇచ్చిన మర్నాడే మేం మీ ఇంటికి నిశ్చితార్థానికి వచ్చాం... ఇందులో రహస్యమేముంది?" అన్నాడు చంద్రం.

నిజానికి ఇందులో రహస్యం ఏమీ ఉండకూడదు. కాని కట్నం ఇవ్వటం మాత్రం రహస్యంగానే జరిగింది. పెళ్ళి అయిన ఏడాది తరువాత మొదటిసారిగా భర్త నోటి మీద విని విస్తుపోవటం తప్ప అరుణ ఇంకేమీ చేయలేకపోయింది!

అరుణ చదువుకునే రోజుల నుంచీ ఆదర్శాలు వల్లిస్తుండేది. ముఖ్యంగా వరకట్నం దురాచారాన్ని పారద్రోలాలంటే ఏం చేయాలో హైస్కూల్లో చదువుకునే రోజుల నుంచీ డిబేట్స్‌లో పాల్గొని తన అభిప్రాయాలు స్పష్టంగా చెబుతుండేది. కాలేజీ చదువుకునే రోజుల్లో ఒకసారి ఈ టాపిక్ మీదే మీటింగ్ పెట్టారు.

ఇది కేవలం ఉపన్యాసాలతో తీరే సమస్య కాదనీ, ఎవరికి వాళ్ళు దీన్ని ఆచరణలో పెట్టినప్పుడే ప్రయోజనం ఉంటుందనీ వాదించింది. వరకట్నం తీసుకునే వ్యక్తిని తను పెళ్లి చేసుకోననీ, ఆ మేరకు ప్రతిజ్ఞ చేసింది. సభాధ్యక్షులవారు, వక్తలూ ఆమెను అభినందించారు. ఆ సభలో మరో అయిదారుగురి చేత ప్రతిజ్ఞలు చేయించారు.

ఆ విషయం తను ఎప్పుడూ మర్చిపోలేదు. తల్లిదండ్రులకి స్పష్టంగా చెప్పింది. కట్నం అడుగుతున్నారని తెల్సి, నాలుగయిదు సంబంధాలను నిరాకరించింది. ఇలా అయితే ఎన్నాళ్ళకీ కూతురుకు పెళ్ళికాదనీ, మంచి సంబంధాలు నిష్కారణంగా చెయ్యి జారిపోతున్నాయనీ, అరుణ తండ్రి సత్యనారాయణ బాధపడ్డారు. కూతురు పెళ్ళి కోసం ముందునుంచే జాగ్రత్త పడి ఆయన రెండు లక్షలదాకా సిద్ధం చేసుకున్నారు. అందుచేత డబ్బు ఉండీ, చేయగలిగిన స్తోమతు ఉండీ, నిక్షేపం లాంటి సంబంధాలను కాలదన్నుకోవటం ఆయనకు నచ్చలేదు. ఈ వెర్రి మొర్రి ఆదర్శాలను నమ్ముకుని కూర్చుంటే జీవితం గడవదు అని ఆయన అభిప్రాయం. నలుగురు నడిచే దోవన నడిచి కూతురు జీవితం సాఫీగా సాగిపోయేలా చేయాలని సత్యనారాయణ తాపత్రయపడ్డాడు. కట్నం ఇచ్చిన విషయం కూతురుకు తెలియకుండా జాగ్రత్త పడ్డాడు.

అరుణ మాత్రం రాజీ పడలేకపోతోంది. తను మోసపోయానని తెల్సుకుంది. తను ఒక ఆశయం కోసం పాటుపడి విజయం సాధించిందనీ, భర్త ఎంతో ఉత్తముడు, ఆదర్శప్రాయుడనీ భావిస్తోంది. కానీ ఇప్పుడు అదంతా వట్టి నాటకమనీ, బూటకమనీ, తండ్రీ, తల్లీ, బంధువులూ, భర్త అత్తమామలూ అందరూ కల్సి కుట్ర పన్ని తనను దగా చేశారన్న భావన కలుగుతోంది. కుడి ఎడమల దగాదగా....

ఆ షాక్ నుంచి తేరుకోకముందే తనకు హీరోహోండా కావాలనీ, తన తల్లికి నెక్లెస్ కావాలనీ చంద్రం పోరటం మొదలెట్టాడు.

"ఇతరుల సొమ్మును ఆశించేవాళ్ళన్నా, ఇతరుల ప్రాపకం మీద బతికే వాళ్ళన్నా నాకు పరమ అసహ్యం. నా దృష్టిలో వాళ్ళంత దగుల్బాజీ వెధవలు ప్రపంచంలో మరొకరు ఉండరు" అన్నది అరుణ ఆవేశంగా.

"నువ్వూ ఇంతకాలం నా సొమ్ము తింటూ నా అండన బతుకుతున్నావు. మరి నీ మీద నీకు ఎందుకు అసహ్యం పుట్టలేదో, నువ్వు ఎందుకు దగుల్బాజీవి కాలేదో నీకే తెలియాలి" అన్నాడు చంద్రం.

అరుణకు అహం దెబ్బతిన్నది. మాట్లాడటం మానేసింది. తిండి తినటం మానేసింది. రెండు రోజుల పాటు నిరాహార దీక్ష చేసింది.

ఆ మధ్యాహ్నం ఆమె అత్తగారు మేడమీద కోడలు గదిలోకి వచ్చి నానా మాటలూ అన్నది.

''మేం దగుల్బాజీలమైనప్పుడు, మా ఇంట్లో ఎందుకే ఉండటం? మా కొంపలో ఎందుకే పస్తులుండి చావటం? ఆ చచ్చేదేదో మీ కొంపలోనే చావు, పీడా వదులుతుంది'' అని తిట్ల వర్షం కురిపించింది.

''పెళ్ళి చేసుకున్న తరువాత నేను ఈ ఇంట్లో మనిషిని. నా భర్త ఇక్కడ ఉంటున్నాడు గనుక ఈ ఇంట్లో ఉండే హక్కు నాకు ఉంది. నన్ను పొమ్మనటానికి నువ్వు ఎవరు?'' అని ఎదిరించింది అరుణ.

''ఏమిటే హక్కు గిక్కూ అంటున్నావు? ఏం చూసుకునే అంత పొగరు? ఉన్న ఫలంగా మెడబట్టి గెంటితే ఎవరే నీకు దిక్కు?'' అంటూ మీదకు వచ్చింది.

''ఒంటిమీద చెయ్యి వేశావంటే మర్యాదగా ఉండదు'' అని కూర్చున్న చోటు నుంచి లేచింది అరుణ.

రెండు రోజుల నుంచీ తిండి లేనందువల్ల బలహీనంగా ఉంది. కళ్ళు తిరుగుతున్నాయి.

అత్తగారు కోడల్ని చెయ్యి పట్టుకుని గదిలో నుంచి బయటకు లాక్కొచ్చి మెట్ల మీద నుంచి తోసేసింది.

మెట్ల మీద నుంచి దొర్లుకుంటూ పడిపోయిన అరుణ తలకు దెబ్బలు తగిలాయి. కడుపు అంతా పచ్చి పుండులా ఉంది. పళ్ళ బిగువున ప్రాణం బిగపట్టుకుని తూలుకుంటూ బయటకు వచ్చి ఆటో ఎక్కింది.

ఆస్పత్రిలో చేరింది. ఎమర్జెన్సీ వార్డులో చేర్చుకుని ట్రీట్‌మెంట్ మొదలెట్టారు. శకుంతల వచ్చి చూసింది.

''అబార్షన్ అయింది. అసలు నీ ప్రాణానికే ముప్పు వచ్చింది. ఇంత రాక్షసంగా వ్యవహరించే మనుషులు ఉంటారంటే నమ్మ బుద్ధి కావటం లేదు....'' అన్నది.

అరుణ ఆస్పత్రిలో వారం రోజులు ఉన్నది. ఆరువేల రూపాయల బిల్లు అయింది. శకుంతల ఫోన్ చేసి చంద్రాన్ని పిలిపించింది. బిల్లు చెల్లించే విషయంలో అరుణకూ చంద్రానికీ మధ్య పెద్ద యుద్ధమే జరిగింది.

''నిన్ను ఈ ఆస్పత్రిలో ఎవడు చేరమన్నాడు? వేలకు వేలు బిల్లు చేసి కూర్చుంటే చెల్లించటానికి ఇక్కడ నీ అబ్బ సొమ్ము ఏమన్నా దాచిపెట్టావా? '' అని అడిగాడు చంద్రం.

''అవును నా అబ్బ సొమ్మే నీ అబ్బ దగ్గర దాచిపెట్టాను. నా తండ్రి ఇచ్చిన లక్ష రూపాయలు, నీ తండ్రి బ్యాంక్‌లో వేసుకొన్నాడు. దానిమీద వడ్డీలే కొన్ని వేల రూపాయల దాకా వచ్చాయి. అందుచేత సాయంత్రం లోపల తెచ్చి బిల్లు చెల్లించు...'' అని నిలదీసింది అరుణ.

''నాకేం అవసరం?'' అని బుకాయించాడు చంద్రం.

''ఎవరికి అవసరమో రేపు నేను డిశ్చార్జి అయి వచ్చాక తెలుస్తుంది. నేను అంత చేతులు ముడుచుకొని కూర్చోలేదు. నా అబ్బ సొమ్ము లక్ష రూపాయలు కాజేశారు. అది చాలక ఇంకా హీరో హోండాలు కావాలి, నెక్లెస్‌లు కావాలని వేధించారు. ఇవ్వనంటే, మేడ మీద నుంచి తోసేసి నన్ను చంపేయబోయింది మీ అమ్మ. చివరకు హాస్పిటల్ బిల్లు కూడా చెల్లించనంటున్నావు. నిన్ను ఇంతటితో వదులుతానని అనుకోవద్దు'' అంటూ వీరావేశంతో విరుచుకుపడింది అరుణ.

''నీ దిక్కున్న చోటుకుపోయి చెప్పుకో. నీ ఇష్టం వచ్చింది చేసుకో ఫో'' అంటూ చంద్రం విసవిసా వెళ్ళిపోయాడు.

శకుంతల నిట్టూర్చింది ''నీకు అంత ఆవేశం ఎందుకే?'' అని అడిగింది.

''ఆవేశం ఏమిటే? ఒళ్ళు మండిపోతుంటేను? డబ్బు ఎలా రాదో నేను చూస్తాను. మొత్తం అంతా కక్కిస్తాను'' అన్నది అరుణ.

తన మెడలో ఉన్న గొలుసు అమ్మింది. హాస్పిటల్ బిల్లు చెల్లించింది అరుణ. కొంత కాలం తన ఇంట్లోనే ఉండమని ఆశ్రయం ఇచ్చింది శకుంతల. వీళ్ళ క్లాస్‌మేట్ రాజశేఖర్ లాయర్‌గా ప్రాక్టీసు చేస్తున్నాడు. అతని దగ్గరకు వెళ్ళి విషయం అంతా చెప్పారు.

''చట్టం దృష్టిలో కట్నం ఇవ్వటమూ, తీసుకోవటమూ రెండూ నేరాలే. మీ మామగారూ, మీ నాన్నగారూ కూడా నేరస్థులే. ఇంతకీ ఇప్పుడు మీకు ఏం కావాలి?'' అని అడిగాడు రాజశేఖర్.

''నాకు విడాకులు కావాలి. దానితోపాటు మా నాన్న ఇచ్చిన లక్ష రూపాయల కట్నం వాపస్ ఇప్పించాలి....'' అని అడిగింది అరుణ.

"మరి మీ నాన్న ఆయనకు కట్నం ఇచ్చినట్లు రుజువు చేయాలి కదా... అఫ్‌కోర్స్, కట్నం ఇచ్చాడని మనం అంటే ఇవ్వలేదని రుజువు చేసుకునే భారం ఆయనదే అయినా, కేసు ఎస్టాబ్లిష్ చేయాలికదా...."

"ఎందుకు ఎస్టాబ్లిష్ చేయలేను. మా వివాహం నిశ్చితార్థానికి ముందు మా నాన్న బ్యాంక్ నుంచి డబ్బు డ్రా చేశాడు. ఆ మర్నాడే మా మామగారు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేసుకున్నారు"

"వాళ్ళ ఎకౌంట్స్ ఏ బ్యాంక్‌లో ఉన్నయో తెల్సా మరి?"

"తెల్సు" అన్నది అరుణ.

రాజశేఖర్ కేసు టేకప్ చేశాడు. కట్నం డబ్బు వాపసు ఇవ్వాలంటూ కోర్టులో కేసు దాఖలు చేసి వాద ప్రతివాదాలు ప్రారంభమైన దగ్గర నుంచీ పత్రికల వాళ్ళకు ఇదొక సెన్సేషనల్ వార్త అయింది. 'కట్నం ఎవరబ్బ సొమ్ము' అంటూ జరిగిన కథ అంతా పత్రికల్లో రాస్తూ వచ్చారు.

అరుణ తండ్రి, చంద్రం తండ్రికి కట్నం ఇచ్చినట్లు రుజువు అయింది. అయితే అరుణ తండ్రి ఆ డబ్బు వాపస్ అడగటం లేదు. అరుణ అడుగుతోంది.

కోర్టులో ఆర్గుమెంట్స్ రసవత్తరంగా జరిగాయి. జడ్జి జగన్నాథం గారు ఒక నిర్ణయానికి వచ్చారు. రేపోమాపో తీర్పు చెప్పబోతున్నాడు. స్టెనో వచ్చి వినయంగా నిలబడ్డాడు.

"నువ్వు రేపు పొద్దున ఎనిమిదింటికి రా. అరుణ కేసులో జడ్జిమెంట్ డిక్టేట్ చేస్తాను. " అన్నాడాయన.

సరేనంటూ స్టెనో వెళ్ళిపోయాడు.

కొంచెం దూరం నుంచీ ఈ సంభాషణ విన్న జడ్జిగారి కోడలు సుభాషిణి వచ్చి ఆయనకు ఎదురుగా కూర్చుంది.

"ఏమ్మా, అబ్బాయి రాలేదా ఇంకా?" అని అడిగాడు ఆప్యాయంగా. సుభాషిణి నాలుగో నెల గర్భవతి.

"మామయ్యగారూ... అరుణ కేసుల్లో ఏమని తీర్పు చెప్పబోతున్నారు?"

"దేనికమ్మా నీకు ఆ కేసులో అంత ఆసక్తి?" అని అడిగారాయన నవ్వుతూ.

"నేనూ ఒక అరుణనే కదా. ఆ తీర్పు నాకూ వర్తిస్తుంది. అందుకనే అంత ఆసక్తి..." అన్నద సుభాషిణి.

జడ్జిగారు అవాక్కు అయిపోయారు.

ఆ మర్నాడు కాదు, ఏనాడూ ఆయన తీర్పు చెప్పలేదు

.

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.